ఉపాధి పనులు పరిశీలన

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలోని సిహెచ్చి అగ్రహారం గ్రామంలో పెంద్యాల చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడివో దెందుకూరు సీతారామరాజు మంగళవారం పరిశీలించారు కూలీలతో పనులు విషయమై మాట్లాడారు. ఈ మేరకు జరుగుతున్న పనులు విషయాన్ని భాగ్యలక్ష్మి తెలియజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కూలీలకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది ఎదురు కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కాగిత గ్రామంలో మంచినీటి ట్యాంకును పరిశీలించి క్లోరినేషన్ చేయమని ఆదేశించారు. ఆ గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి ఈ కేంద్ర నిర్వహణ విషయం పైన ఎరువులు రైతులు తీసుకెళ్లే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయనతోపాటు సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, పంచాయతీ కార్యదర్శి చిన్నం నాయుడు ఉన్నారు.

రూ.10 లక్షలతో రెండు మదుంల నిర్మాణం

విశాలాంధ్ర-పాయకరావుపేట : మండలంలోని గుంటపల్లి, మంగవరం గ్రామాల్లోని సాగునీటి కాలువలపై ఇరిగేషన్ అధికారులు రెండు మదుంల నిర్మాణం చేపట్టారు. మండల పరిషత్ గ్రాంట్ తో పనులు చేస్తున్నారు. నిర్మాణం చేపట్టే ప్రదేశంలో ఉన్న పాత మదుం లను తొలగిస్తున్నారు. గుంటపల్లి గ్రామంలో గుంటపల్లి, బాడవ కాలువలకు చెందిన డివిజన్ డ్యాం, మంగవరం గ్రామంలో నాలుగు కాళ్ల మదుం లను రూ. 10లక్షలతో నిర్వహించనున్నారు.

పదవ తరగతి పిల్లలకు స్టేషనరీ పంపిణీ

విశాలాంధ్ర-గొలుగొండ : ఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు స్థానిక శ్రీ అల్లూరి వర్తక సంఘం సభ్యులు రానున్న పరీక్షల నిమిత్తం స్టేషనరీ అందజేశారు అనంతరం పెద్దలు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తుకు పదవ తరగతి పరీక్ష ఎంతో ఇంపార్టెంట్ అని పిల్లలు ఎంతో చక్కగా పరీక్షలు రాసి గ్రామానికి స్కూల్ కి మంచి పేరు తీసుకురావాలని, స్కూల్ మొత్తానికి ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రథమ బహుమతి ద్వితీయ బహుమతి తృతీయ బహుమతి పిల్లలకు అందజేస్తామని స్థానిక శ్రీఅల్లూరి వర్తక సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరావు, నానిబాబు, జోగుబాబు, జోగునాదం, రామకృష్ణ, చక్రి, శివ, లక్ష్మి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెంలో సిసి రోడ్డు డ్రైన్ నిర్మాణం ప్రారంభం

విశాలాంధ్ర -మాకవరపాలెం: మాకవరపాలెంలో డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణం కొరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గారు చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు మాకవరపాలెం మెయిన్ రోడ్డు(బోలెం గోవింద పాన్ షాప్) నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పది హేను లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. ఈరోజు సిమెంటు డ్రైన్లు కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడింది. మాకవరపాలెం ఉప సర్పంచ్ లాల%శీ% రాము గారు ఆధ్వర్యంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమములో డిఈ ఈశ్వరరావు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆనంద్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -మునగపాక: మండలంలో చూచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ ఆకస్మికంగా తనికి చేశారు. పీహెచ్సి నందు వ్యాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణను, ల్యాబ్‌ను, మందుల స్టోర్ ను,వార్డ్ ను,ఆపరేషన్ థియేటర్ ను,రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పీహెచ్సి డెలివరీస్ కోసం అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సమీక్షించి రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్తేర్ రాణి 5 ఫ్యామిలీ ప్లానింగ్ కేసులు చేస్తూ ఉన్నారు. డీఎం&ఎచ్ఓ ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గుర్రం శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఏ.సువర్ణరాజు, హెల్త్ సూపర్వైజర్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

పలు శివాలయాల నిర్మాణానికి పి.బి.వి.ఎస్.ఎన్ రాజు రూ. 6,11,116 విరాళం

విశాలాంధ్ర-సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక శివాలయం పునః నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన అనకాపల్లి జిల్లా టీడిపి తెలుగు యువత అధ్యక్షుడు పి.బి.వి.ఎస్.ఎన్ రాజు (బుచ్చిరాజు) దంపతులు రూ. 5,11,116 ఆర్థిక సహాయం మంగళవారం శివాలయం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. అలాగే పెదనాయుడుపాలెం శివారు గణపతిపురం శ్రీ మల్లికార్జున స్వామి శివాలయం నిర్మాణానికి రూ. 1,00,000 ఆర్థిక సహాయం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా పి. బి. వి. ఎస్. ఎన్ రాజు (బుచ్చిరాజు)దంపతులకు ఆయా శివాలయాల ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో దంగేటి ప్రకాష్, దంగేటి నాని, గెద్దం కృష్ణ, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, కిల్లి వెంకట సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డికి యువత, విద్యార్థులు ఇప్పుడు గుర్తొస్తున్నారా?

అనకాపల్లి జిల్లా తెలుగుదేశం విద్యార్థి విభాగం అధ్యక్షుడు పెదిరెడ్డి నాగ వెంకటరమణ

విశాలాంధ్ర-పాయకరావుపేట : గత వైసిపి ప్రభుత్వం పెట్టిన బకాయిలు తెలుగుదేశం ప్రభుత్వం తీరుస్తుండటం వలనే చాలా మంది విద్యార్థులకు సర్టిఫికేట్లు అందుతున్నాయని అనకాపల్లి జిల్లా తెలుగుదేశం విద్యార్థి విభాగం అధ్యక్షుడు పెదిరెడ్డి నాగ వెంకటరమణ అన్నారు. గత ప్రభుత్వంలో పెట్టిన ఫీజు బకాయిలు పై ఇప్పుడు వైసీపీ నాయకులు ఫీజు పోరు చేయటం హాస్యాస్పదమన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వకుండా ఎన్నో ఇబ్బందులు గురి చేశారని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదన్నారు. అడిగితే లాఠీ చార్జీలు చేయించాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈ ఏడాదికి రూ.788 కోట్లను నేరుగా కాలేజీలకు చెల్లించారని తెలిపారు. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.4,271 కోట్ల పాత బకాయిలను కూడా విడతల వారీగా చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాగ వెంకటరమణ తెలిపారు.

వడ్డాదిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని పూర్వ వైభవం తెస్తాం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేసేందుకు అనుబంధ పరిశ్రమలు నెలకొల్పుతాం

ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు హామీ

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలం లో వడ్డాది గిరిజాంబ కొండపై వలసిన వెంకటేశ్వర స్వామి వడ్డాది వెంకన్న 152 వ వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో స్థానిక శాసనసభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు పాల్గొని పలు హామీలు ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అభిమానులు పెద్ద ఎత్తున సందడి చేశారు ఆలయ పురోహితులు ఆలయ ధర్మకర్త వేద ఆశీర్వాదాల మధ్య పూర్ణకుంభంతో కేఎస్ఎన్‌కు ఘన స్వాగతం పలికారు, కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపాటు విశాఖ డైరీ డైరెక్టర్, గేదల సత్యనారాయణ ఎంపీపీ నాగేశ్వరిదేవి, దేవస్థానం ధర్మకర్త దొండా కన్నబాబు ఈవో శర్మ, వడ్డాది టౌన్ టీడీపీ అధ్యక్షులు దొండా నరేష్, మాజీ జడ్పీటీసీలు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు మాజీ వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు ఎంపీటీసీలు ఫోరమ్ అధ్యక్షులు దేవర అప్పారావు, వివిధ గ్రామాలు కూటమి నాయుకులతోపాటు మండల బీజేపీ అధ్యక్షులు సీతా నాగరాజు కార్యదర్శి దొండా నానాజీ పాల్గొన్నారు.

క్రీడల్లో న్యాయ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-సబ్బవరం : దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విద్యార్థులు ఈనెల 6 నుండి 10 వరకు కోల్‌కతా లోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్ (ఎన్ యూ జె ఎస్)లో జరిగిన వార్షిక క్రీడా ఉత్సవం 'ఇన్విక్టా '25 లో పాల్గొని అద్భుతమైన ప్రతిభ ను కనబర్చినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు తెలిపారు. ఈపోటీలలో తమ విశ్వవిద్యాలయ%శీ% నకు చెందిన 65 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. భారతదేశం లోని వివిధ విశ్వవిద్యాలయాలనుండి 25 జట్లు పాల్గొన్న ఈపోటీలలో అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలతో తీవ్రంగా పోటీపడి తమ విద్యార్థులు అసాధారణమైన క్రీడా ప్రతిభ మరియు జట్టు స్ఫూర్తిని ప్రదర్శించారని తెలిపారు. డిఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులు అన్ని రంగాలలో ప్రతిభ కనపరచి రన్నరప్ టైటిల్‌ను గెలుచుకున్నట్లు తెలిపారు.బాస్కెట్‌బాల్ (పురుషులు), వాలీబాల్ (పురుషులు), త్రోబాల్ (మహిళలు), బ్యాడ్మింటన్ మరియు బహుళ ట్రాక్ ఈవెంట్‌లలో బంగారు పతకాలు సాధించారని తెలిపారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్ మరియు అథ్లెటిక్స్‌లో రజత పతకాలు సాధించగా, షాట్‌పుట్, లాంగ్ జంప్ మరియు హైజంప్ ఈవెంట్‌లలో కాంస్య పతకాలు సాధించారని అన్నారు.ఈ సందర్భంగా అయన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఒ. మంగ రాజు మరియు స్పోర్ట్స్ కమిటీ అధ్యాపకులు, విద్యార్థి బృందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గావు పండుగ సంబరాలు

విశాలాంధ్ర-కే.కోటపాడు : ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించే గంగాదేవి గావు పండుగ ఈ మండలం కింతాడ శివారు జోగన్నపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో గంగాదేవి గావు పండుగ చేస్తుండగా మరికొన్ని గ్రామాల్లో పోతురాజు గావు పండుగ చేస్తుంటారు. ఈ పండుగలు గ్రామం మొత్తం కాకుండా కొన్ని కుటుంబాలు నిర్వహణలో జరుగుతుంటాయి. పండుగ రోజున గంగమ్మకు పూజలు చేసి పోతురాజు బాబుకు మొక్కులు చెల్లిస్తుంటారు. గంగాదేవికి ప్రత్యేకమైన ఆలయాలు అంటూ ఉండవు. ఒక చిన్న ఇంట్లో గంగాదేవి కొలువు అయి ఉంటుందన్న దానికి నిదర్శనంగా కుంకుమ భరిణ ఒక కత్తి ఉంటాయి. వాటికి పూజలు నిర్వహిస్తారు. ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు పూజలు చేస్తారు . నిరంతరాయంగా తప్పెడు గుళ్ళు ప్రదర్శన జరుగుతుంది. గ్రామం మొత్తం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పండుగలో అమ్మవారికి మొక్కుల తీర్చుకోవటానికి పెద్ద పందిళ్లను ఏర్పాటు చేస్తారు. ఆ పందిళ్లకు వస్త్రాలు అరటి గెలలు కొబ్బరి బోందాలు వివిధ రకాల పళ్ళు కరెన్సీ నోట్లు వేలాడదీస్తారు. కొందరు మేకలు మొక్కుకుంటూ అమ్మవారికి సమర్పిస్తుంటారు. గంగాదేవికి ఒకవైపు పూజ జరుగుతుండగా పందేళ్లకు వేలాడదీసిన పళ్ళు ఫలాలను భక్తులు నిలువు దోపిడీ చేస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం కాబట్టి ఈ పండుగ తిలకించడానికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి ప్రజలు తరలి వస్తారు. జోగన్నపాలెంలో జరిగిన గంగాదేవి గావు పండుగ గ్రామ సర్పంచ్ బందారు ఈశ్వరమ్మ మాజీ సర్పంచ్ బందారు నరసింహనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైకాపా ఆవిర్భావ కార్యక్రమన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చీడికాడ : మండలంలోని వరహాపురం గ్రామంలో నేడు బుధవారం నిర్వహించు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమన్ని జయప్రదం చేయాలనీ వైసిపి మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు కోరారు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణలో భాగంగా వరహాపురంలో మండల స్థాయి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు పార్టీ జెండా ఎగురవేసేందుకు ఉదయం 8 గంటలకు ఎంపీపీ జడ్పిటిసి లతోపాటు వైస్ ఎంపీపీలు ఎంపీటీసీలు సర్పంచులు పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అనుబంధ శాఖల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తప్పకుండా హాజరువాలని అయన కోరారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కలిగించేందుకు సిబ్బంది కేటాయింపు

విశాలాంధ్ర-పాయకరావుపేట : పాయకరావుపేట గ్రామపంచాయతీలో తడి, పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు 20వ వార్డులకు సిబ్బందిని కేటాయించినట్లు ఈవోపీఆర్డి సిహెచ్. చంద్రశేఖర రావు తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి, బిల్లు కలెక్టర్లకు, జూనియర్ అసిస్టెంట్లకు ఐవిఆర్ఎస్ సర్వే పై ఇంటింటికి ప్రసారం ముమ్మరం చేయాలని ఆదేశించామన్నారు. సర్వే పట్ల ప్రజలకు ఎటువంటి అపోహలు లేకుండా పూర్తిగా అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పల శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైసిపి 'యువత పోరు'

విశాలాంధ్ర-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు నేడు వైస్సార్సీపీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనిజిల్లా వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ తెలిపారు. రింగ్ రోడ్డు వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం వైస్సార్సీపీ యువత పోరు పోస్టరును ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రియింబర్స్ మెంట్, నిరుద్యోగ భృతి అమలు పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ నేడు యువత పోరు పేరిట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కి వినతిపత్రం అంద చేయనున్నట్లు తెలిపారు. పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది శెట్టి గోవిందా, మల్ల బుల్లిబాబు, మలసాల కిషోర్, కె.ఎం.నాయుడు, జాజుల రమేష్, కలగాగున్నయ్ నాయుడు, ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ద్వితీయ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-యలమంచిలి : మే 5, 6, 7వ తేదీల్లో జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అనకాపల్లి జిల్లా జిల్లా రెండవ మహాసభ కరపత్రాలు చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అనకాపల్లి జిల్లా ద్వితీయ మహాసభ సందర్భంగా యలమంచిలిలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.) సమసమాజ స్థాపనే ధ్యేయంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదుల బానిసత్వంలో మగ్గుతున్న దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యంగా 1925 డిసెంబర్ 26న భారత గడ్డ మీద ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్లో పురుడు పోసుకుందని అన్నారు. పొత్తిళ్ళలోనే పోరాటాన్ని పుణికిపుచ్చుకొని అనేక కుట్ర కేసులను, నిర్బంధాలను, నిషేధాలను ఎదుర్కొని భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అశేషమైన త్యాగాలు చేసి అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ, భూసంస్కరణల అమలుకోసం పోరాడి సాధించిందని, భారతీయ సమాజాన్ని రాచపుండులా వేల ఏళ్లుగా పట్టిపీడిస్తున్న అంటరానితనం, కులం, మతం వంటి సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం నింపి పోరుసల్పిందని అన్నారు. బాల్యవివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలను నిర్మూలించడంలో సిపిఐ క్రియాశీలక పాత్ర పోషించిందని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయడమే కాకుండా వాటి పరరక్షణకు వీరోచిత ఉద్యమాలను నడిపించిందని తెలిపారు. దేశ సార్వభౌమాధికారం, మత సామరస్యం, లౌకికతత్వం, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించిందని అన్నారు. అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత జరుగుతున్న సిపిఐ రెండవ జిల్లా మహాసభ అనేక కీలకమైన సామాజిక, రాజకీయ అంశాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణకు వేదిక కానున్నదని తెలిపారు. జరుగుతున్న మహాసభలకు జిల్లా వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈమహాసభలు విజయవంతం చేయదానికి, భవిష్యత్లో బలమైన ఉద్యమ నిర్మాణానికి మీ యొక్క హార్థిక, ఆర్థిక సహకారాన్ని అందించడం ద్వారా ప్రజల పార్టీని మరింత సమరశీల పోరాటాల దిశగా నడిపిస్తారని విజ్ఞప్తి చేస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజన్న దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, రామ నాయుడు, సుబ్బలక్ష్మి, జిల్లా నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలబాలికలకు ఉపకారణాల వితరణ

ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్

విశాలాంధ్ర-పరవాడ : దివ్యాంగ బాల బాలికలకు సింహాద్రి ఎన్టీపీసీ రూ.12.99 లక్షలతో ఉపకారణాలు అందజేయడం హర్షనీయమని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ సంయుక్త హాల్లో సింహాద్రి, సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహించిన ఉపకరణాల వితరణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగ బాలబాలికల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల, రిసోర్స్ ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో పాటు కనీస ఉపకరణాలు వారి అభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు రిసోర్స్ ఉపాధ్యాయులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సమగ్ర శిక్ష అదనపు సంచాలకులు డాక్టర్ జయప్రకాష్ విధుల్లో చేరిన అనతి కాలంలోనే దివ్యాంగ బాలబాలికలకు ఇటువంటి మంచి కార్యక్రమాలు అమలు చేయడంపై ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. జయప్రకాశ్ మాట్లాడుతూ గతంలో ఎన్టీపీసీ సంస్థ ఉమ్మడి విశాఖ జిల్లాలో 43 భవిత కేంద్రాలకు 12 లక్షలతో ఉపకరణాలు అందజేశారని, ఇపుడు తాజాగా రూ.12.99 లక్షలతో జిల్లాలో గల 24 భవిత కేంద్రాలకు, ఆరు సహిత విద్యా రిసోర్స్ రూములకు ఉపకరణాలు అందజేయడం చాలా ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎన్టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా పలు విద్య,వైద్య, బాలికా సాధికారత, ఉపకార వేతనాలు వంటి సామాజిక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మండలాల వారీగా భవిత కేంద్రాలకు, దివ్యాంగ బాలబాలికలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ బాలబాలికలచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి. శకుంతల, మండలాల రిసోర్స్ ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, దివ్యాంగ బాలబాలికలు, తల్లిదండ్రులు, ఎన్టిపిసి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారుల అండదండలతో యదేచ్ఛగా భూకబ్జాలు

కబ్జాలకు కేరాఫ్ చోడ'వరం'గా మార్చిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-చోడవరం:స్థానిక తెలుగుదేశం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, ప్రభుత్వ అధికారుల అండ దండలతో చోడవరం పట్టణంలో భూ కబ్జాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. పట్టణం ఏవిధంగానూ అభివృద్ధి చెందకపోయినను కబ్జాలకు కేరాఫ్ చోడ'వరం'గా ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు మార్చేస్తున్నారని స్థానికులు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, రోడ్డు విస్తరణతో ప్రధాన రహదారుల్లో కబ్జాలను నివారించగలిగారు. కూటమి ప్రభుత్వం అందలం ఎక్కాక ఎమ్మెల్యే అండతో బి.ఎన్. రోడ్డులో కబ్జాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. దీనిపై ప్రశ్నించే నాధుడే కరువయ్యాడు. ఎమ్మెల్యే రాజు, ప్రభుత్వ అధికారులు కబ్జాలకు వంత పాడడంతో భూ ఆక్రమణదారులు యదేచ్ఛగా రోడ్లు, డ్రైనేజీలు వేటినీ వదలకుండా కబ్జాలు కొనసాగిస్తున్నారు. అధికారులకు, చోటా కూటమి నేతలకు డబ్బు కొట్టు స్థలం పట్టు అన్న చందంగా చోడవరం మారింది. పంచాయతీ స్థలాల్లోను, డ్రైనేజీలను అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. బి.ఎన్ రోడ్డులో తల్లి పిల్ల హాస్పిటల్ ఎదురుగా డ్రైనేజీ పైనే షాపు కట్టుకోమని అధికారులు చెప్పినట్టు షాప్ యజమానులు చెబుతున్నారు. చీడికాడ రోడ్లో పోలమాంబ గుడి పక్కన, చోడవరంలో పెద్ద వ్యాపారస్తుడు పంచాయతీ స్థలంలో ఎటువంటి అధికారిక అనుమతులు లేకపోయినా, షాపింగ్ కాంప్లెక్స్ కట్టుకోడానికి సిద్ధపడుతున్నారు. అధికారులకు తెలిసినను పట్టించుకోలేదని మహిళ, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రోడ్ల విస్తరణ త్వరలో చేపడతామంటూ ప్రకటించడం, స్థానిక తెలుగుదేశం ఎమ్మెల్యే రాజు భూకబ్జాలకు తెర తీయడం దేనికి సంకేతమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అమాయకులను బలి చేసేందుకా, లేక వ్యాపారస్తుల నుండి డబ్బు దండుకునేందుకు ఎమ్మెల్యే, అధికారుల పన్నాగమా అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా!

- పత్రికల్లో వచ్చిన శీర్షికలపై రెవెన్యూ అధికారుల అరకొర స్పందన
- స్థానిక ఎమ్మెల్యేకు పిర్యాదు చేసిన పంచాయతీ టీడీపీ నేత
- ఎన్నికల కోడ్ చాటున ఇనుపకంచె ఏర్పాటు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు
- రెవెన్యూ సిబ్బందిపై ప్రజా సంఘాల ఆరోపణ
- ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ శాఖ అధికారి జాప్యం

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నెంబర్లు 170 మరియు 171 జిరాయితీ భూములు ఉన్నాయని వాటిని ఆనుకొని సర్వే నెంబర్ 168 లో సుమారు 14 ఎకరాల భూమిలో గెడ్డ పోరంబోకు ఉండడంతో దానిని కబ్జా చేసి ఆ భూమి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి దాని వంక ఎటువంటి అధికారులు చూడకుండా ఆమ్యామ్యాలు ముట్ట చెప్పారని పలు పత్రికలలో వచ్చిన కథనాలు స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అదే స్థలంలో ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేసినట్టు స్థానిక వీఆర్ఏ తెలిపినప్పటికీ రెవెన్యూ అధికారులు నేడు అవేమీ పట్టనట్లు చూసి చూడకుండా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందని పత్రికలలో వచ్చిన కథనాల పట్ల స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఆక్రమణకు గురైన స్థలంలో కాక పక్కన బోర్డులు ఏర్పాటు చేయడం తగదని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఇనుపకంచె తొలగించాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్న సందర్భంలో కేవలం చట్టం పేదల పై మాత్రమే ఉపయోగిస్తారని పెద్దలకు చుట్టం అని నిరూపించిన ఘటనలు స్పష్టంగా కనబడుతున్న తరుణంలో మండలంలోని రెవిన్యూ శాఖ అధికారులు కానీ స్థానిక మీడియా మౌనం వహించడం తో అవినీతి ఎంత పెద్ద మొత్తంలో జరిగిందో అనే విధంగా పలు అనుమానాలకు బలం చేకూరుతుందని స్థానిక ప్రజా సంఘాల ఆరోపిస్తున్నాయి. తైపురం గ్రామపంచాయతీ టిడిపి నాయకుడైన పల్లా చిన్న పలుదపాలుగా స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదుచేసి నిరుపేదలకు దక్కాల్సిన భూమిని కబ్జా చేస్తున్నారని తెలిపినప్పటికీ ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇదే అదునుగా సందడిలో గుట్టు చప్పుడు కాకుండా కబ్జాదారులు ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్ చాటున ఆక్రమణ చేసిన భూమి చుట్టూ ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఆక్రమణల తొలగింపులో చర్యలు చేపట్టకుండా మౌనం వహించడం తగదని ఇలా అయితే మండలంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని ఇదే ధోరణి కొనసాగితే పేదవాళ్ల భూములను కూడా ఆక్రమించుకునే పరిస్థితి వస్తుందని ప్రజల భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధించిన శాఖ అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములు రక్షించాలని పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

బోర్డుల ఏర్పాటేనా... ఆక్రమణదారులపై చర్యలు తీసుకోరా? : పత్రికలలో వచ్చిన కథనాలపై స్పందించిన రెవెన్యూ అధికారులు కేవలం బోర్డులు మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని దీనిపై సమగ్ర విచారణ జరిపి సంబంధించిన స్థలం నుండి ఇనుపకంచే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మృతురాలి దాహన ఖర్చులకు రూ.5000 అందజేత

విశాలాంధ్ర -మునగపాక : స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన డొక్కా జ్యోత్స్న కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మంగళవారం మరణించారు. ఈ సందర్భంగా దాహన ఖర్చుల నిమిత్తం ఆడారి దానకర్ణ 5000 రూపాయలు సహాయం అందించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం,జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు సూరిశెట్టి అప్పలనాయుడు,తదితరులు పాల్గొన్నారు.

12, 13వ తేదీల్లో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల పర్యటన : జేసీ

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషను సభ్యులు జి.దేవి ఈనెల 12, 13 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నట్లు జాయింట్ కలెక్టరు ఎమ్. జాహ్నవి తెలిపారు. మార్చి 12వ తేదిన విశాఖపట్నం జిల్లా పర్యటన అనంతరం అనకాపల్లి జిల్లాకు చేరుకుంటారని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌకధరల దుకాణాలు, సరుకులు పంపిణీ వాహనాలు, ఎస్.సి., ఎస్.టి., బి.సి., సంక్షేమ వసతి గృహాలు తనిఖీచేస్తారని మరియు మధ్యాహ్న భోజన పథకం క్రింద పోషకాహార కార్యక్రమాల అమలును పరిశీలిస్తారని తెలిపారు.

తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

విశాలాంధ్ర-మాకవరపాలెం : మాకవరపాలెం మండలం బూరుగుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కె వి ఎస్ నాగేశ్వరరావు గారి సమక్షంలో పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులతో పాసై ఈ స్కూల్‌కి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని భవిష్యత్తులో ఉన్నతమైన చదువులు చదవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పడం జరిగింది. మండల టిడిపి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి మరియు హై స్కూల్ చైర్మన్ ఉప్మా క మరిడియ గారి చేతుల మీద పెన్నులు పంపిణీ చేయడం జరిగింది స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడాలి

ప్రజా చైతన్య యాత్రలో విసిఐసి నిర్వాసితులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు భరోసా
-పునరావాసం చెల్లించకుండా పనులు చేయడంపై అభ్యంతరం

విశాలాంధ్ర-నక్కపల్లి : విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల భూములకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించకుండా పనులెలా చేపడతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ప్రశ్నించారు. పిడిఎఫ్ గ్రామాల్లో ఇళ్లు, భూములు, చెట్లకు పూర్తి పరిహారం, మేజర్లకు ప్యాకేజి చెల్లించకుండా చేపడుతున్న పనులను అడ్డుకోవాలన్నారు. న్యాయమైన పరిహారం కోసం నిర్వాసితులు చేసే పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని అన్నారు. మంగళవారం నక్కపల్లి మండలం కాగిత, పాటిమీద, మూలపర్రు, తమ్మయ్యపేట, రాజయ్యపేట, బుచ్చిరాజుపేటలో జరిగిన ప్రజా చైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారము డి పట్టా భూములకు జిరాయితీ భూముల వలే పరిహారము చెల్లించాలన్నారు. పూర్తి పరిహారం చెల్లించకుండా భూములు అప్పగించబోమని చెప్పాలన్నారు. న్యాయమైన పరిహారం, పునరావాసం, ప్యాకేజీ దక్కే వరకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పరిహారం చెల్లింపులో చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులను జైల్లో పెట్టాలన్నారు. నిర్వాసితులను బెదిరించి భూములు, ఇల్లు స్వాధీనం చేసుకునే అధికారులకు కలెక్టర్ నోటీసులు జారీజేయాలన్నారు. మిట్టల్ వంటి పెట్టుబడిదారులకు అమ్ముడుపోయి ప్రజలపై జులుం ప్రదర్శిస్తే ఐక్య పోరాటాలతో

తిప్పికొట్టాలన్నారు. దౌర్జన్యంగా భూమి, ఇల్లు ఖాళీ చేయించే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రైతుల భూములతో పల రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. భూములిచ్చిన స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంలేదన్నారు. డి పట్టా, సాగు భూముల్లోని చెట్లకు పరిహారం చెల్లించకుండా నిరంకుశంగా ప్రజలపట్ల వ్యవహరించడం సరికాదన్నారు. తీర ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ మరణశాసనంలా తయారైందన్నారు. గ్రామసభ, ప్రజల ఆమోదం లేకుండా పార్కు పెట్టకూడదన్నారు. పరిశ్రమలు వచ్చినచోట ప్రజల బతుకులు బజారుపాలవుతున్నాయేగానే బాగుపడ్డామని చెప్పడంలేదన్నారు. గ్రామాలకు తాగునీరు ఇవ్వలేనివారు, ప్రజలను అభివృద్ధి చేస్తామనడం మోసాగించడమేనని అన్నారు. కాలుష్య బాధిత రాజయపేట కుటుంబాలకు ప్యాకేజి ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయమైన హక్కులు, పర్యావరణ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం మాట్లాడుతూ రాజయ్యపేటలో సాగులోవున్న మత్స్యకారులు, పేదలకు పట్టాలివ్వాలన్నారు .వేట నిషేధ కాల పరిహారం 20 వేలు మత్స్యకారులకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఎం రాజేష్, డి వరలక్ష్మి, నక్కపల్లి మండల పార్టీ నాయకులు మహేష్, యాదగిరి, బత్తిన నాగేశ్వరరావు, ప్రసాద్, రాము, రాజయ్యపేట సభలో జెడ్పిటిసి కాసులమ్మ, జనసేన నాయకుడు పిక్కి స్వామి తదితరులు పాల్గొన్నారు.

దళిత చైతన్య సేవా సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు 200 చీరలు పంపిణీ

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని స్థానిక శ్రీ సీతారామ కళ్యాణ మండపం నందు సోమవారం దళిత చైతన్య సేవా సంఘం 20వ వార్షికోత్సవం పురస్కరించు కొని సంఘం అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో 200 మంది ఎస్సీ మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత చైతన్య సేవా సంఘం అధ్యక్షులు గొల్లపల్లి ప్రభాకర్ రావు చీరలు పంపిణీ చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. విశాఖపట్నం జిల్లా పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ జై భీమ్ అసోసియేషన్ సెక్రటరీ యల్లపు రాంబాబు మాట్లాడుతూ దళిత చైతన్య సేవా సంఘం పెట్టి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. గొల్లపల్లి ప్రభాకర్ రావు సబ్బవరం మండలంలో ప్రతి ఒక్క ఎస్సీ గ్రామంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు అంతేకాకుండా తన సొంత నిధులతో దుప్పట్లు, చదువుకునే పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు లాంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి ఇందలి రమణ, జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, బంతి కోళ్ల పద్మ, కర్రి కనకరాజు, కిల్లి సత్యనారాయణ, పల్లి మంగరాజు, రెండవ వార్డ్ మెంబర్ శేఖర్, మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన భీమరశెట్టి

విశాలాంధ్ర - మునగపాక : కూటమి ప్రభుత్వం మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు, ఒకటి ఎస్సీ వర్గాలకు కేటాయించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కూటమి ప్రభుత్వం బీసీలకు అన్నిరంగాల్లో సముచితస్థానం కల్పించడంపై సీఎం చంద్రబాబు,టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్రామదేవతల పండగ

విశాలాంధ్ర-పరవాడ : మండలంలోని పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో పైడిమాంబ, పరదేశిమాంబ, పోలమాంబ అమ్మవార్ల పండగలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి దాటాక అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద ఎత్తున గ్రామదేవతలను దర్శించుకున్నారు. కానుకలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆయా ఆలయాల వద్ద ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం వంటివి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తదితరులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవార్ల ఘటాలను గ్రామాల్లో ఊరేగించిన అనంతరం రాత్రికి ఆలయాల వద్దకు తీసుకొచ్చి అనుపోత్సవం చేసారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. ఈ అమ్మవార్ల ఉత్సవాల్లో మండల, గ్రామ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి పూత, పిందెలు దశలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు

జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జి.ప్రభాకరరావు

విశాలాంధ్ర-సబ్బవరం : మామిడి పూత, పిందెలు దశలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను మామిడి రైతులకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని తవ్వానిపాలెం, అమృతపురం గ్రామాల్లో మంగళవారం అయన పర్యటించి మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మామిడి రైతులతో ముఖాముఖీ మాట్లాడి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మామిడి పూత విచ్చుకున్నప్పటి నుండి తేలికపాటి తడులతో ప్రారంభించి నీటిని అందించాలన్నారు. అలాగే పిందె కట్టిన దశలో, రెండవ దఫా సిఫారసు చేసిన ఎరువులను వేసుకోవాలన్నారు. తేనె మంచు పురుగు నివారణకు, బుప్రోఫిజిన్ 1.5 మి. లీ/లీటర్ లేదా బుప్రోఫిజిన్ ం ఆసిఫేట్ 1గ్రా/లీటర్ లేదా డైనోటేఫ్యురాన్ 0.2గ్రా/లీటర్ తో పాటు వేప నూనె 3 మీ.లీ/లీటరు జిగురు 0.5 మి. లీ/లీటర్ తో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే తామర పురుగు నివారణకు, నీలం రంగు జిగురు అట్టలు చెట్టు మార్చి చెట్టుకు, ఒక్కొక్కటి చొప్పున పెట్టుకోవడంతో పాటు పాదులో ఫాలిడాల్/క్లోరోపైరిఫాస్/వేప పిండి వేయడం ద్వారా నిద్రావస్/కోశస్థ దశలను నిర్మూలించడంజరుగుతుందన్నారు. ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా అసిఫేట్ 1.5 గ్రా లేదా ఇమిడా 0.5 మి.లీ. లేదా థయోమెథాక్సామ్ 0.3 గ్రా లేదా స్పైనోశాడ్ 0.4 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్2 మీ.లీ./లీ. లేదా అసిటామీప్రిడ్ 1జి లేదా డెల్టమిథోయేట్ 2 మి.ఈ. లేదా వేపనూనె

10000 పీపీఎం 2 మి.లీ/.లీ. పిచికారి చేయాలన్నారు. మామిడి కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పండ్ల కవర్లను తొడగాలన్నారు. అధికంగా పూత, పిందె రాలుతున్నప్పుడు ప్లానోఫిక్స్ 2 మిలి/లీటర్ నీటికి కలిపి, డోసు ఎక్కువ కాకుండా, వేరే ఇతర మందులతో కలపకుండా ఉదయం/సాయంకాల సమయాల్లో పిచికారి చేయాలన్నారు.జీవన ఎరువులను 250గ్రా చొప్పున పశువుల ఎరువులో కలిపి వాడుకోవడం ద్వారా మొక్కకి పోషకాల లభ్యతను పెంచవచ్చునన్నారు. అలాగే మామిడి కాయ పెరిగే దశలో 13:0:45 10గ్రా/లి. యూరియా 5గ్రా/లి పిచికారి చేసినచో కాయ ఎదుగుదలకు తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి ఆర్. కిరణ్మయి, గ్రామ ఉద్యానవన సహాయకులు పి.భావన తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

జిల్లా పశు సవర్థక శాఖ అధికారి డా. బి. రామ మోహన్ రావు

విశాలాంధ్ర - సబ్బవరం : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సవర్థక శాఖ అధికారి డా. బి.రామమోహన్‌రావు అన్నారు. మండలంలోని మల్లునాయుడుపాలెం, బోదువలస గ్రామాలలో గుల్లేపల్లి పశు వైద్యాధికారి బి. సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం అనకాపల్లి జిల్లా పశు సవర్ధక శాఖ అధికారి డా.బి.రామమోహన్‌రావు, విశాఖపట్నం డివిజన్ ఉపసంచాలకులు డా.చంద్రశేఖర్ ,సబ్బవరం సహాయ సంచాలకులు డా.ఉషాకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు ఈనెల 30వ వరకు ఉచితంగా టీకాలు వేస్తారని, పాడి రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే 4 నుండి 8నెలల ఆడ పెయ్యలకు బ్రుసెల్లా వ్యాధి సోకకుండా ముందుగానే టీకాలు వేయించుకోవాలని అన్నారు. మండలం లో ఉన్న 18000 పశువులకు గాను 5600 పశువులకు ఇప్పటి వరకు టీకాలు వెయ్యడం జరిగినదని తెలిపారు. ఈ రెండు గ్రామాలలో 82 పశువులకి టీకాలు వేయడం జరిగిందని పశు వైద్యాధికారి బి. సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధిక సహాయకులు ఎ. రమేష్, డి. రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీదారుల ఆస్తులు జప్తు చేస్తాం

ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి బి.శ్రీనాథుడు

విశాలాంధ్ర-వేపాడ : గ్రామాల్లో నాటు సారాయి తయారు చేయడం, రవాణా చేయడం, అమ్మడం, కొనుగోలు చేయడం షట్టరీత్య నేరం కావున సారాయి నిషేధించడమైనదని, అలా చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటూ వారి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని ప్రొబేషన్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి బి. శ్రీనాథుడు అన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణ రాయుడుపేట గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నాటు సారా సేవించడం వలన అనారోగ్యం పాలై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ప్రభుత్వం తలపెట్టిన ఈ నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని అలాగే గ్రామాలు పచ్చగా ఉండే విధంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.అలా కానీ యెడల నాటు సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే కొత్తవలస ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సిఐ సిహెచ్ ఎస్ రాజశేఖర్ నాయుడు మాట్లాడుతూ నాటు సార తయారీకి ఉపయోగపడే నల్ల బెల్లం, అమోనియం, తదితర ముడి పదార్థాలు ఎవరైనా అమ్మితే విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే గ్రామ సర్పంచ్ సిహెచ్ బాలబాబు,మాజీ సర్పంచులు అల బోని పైడిబాబు, బి.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు తదితరులు ప్రసంగిస్తూ గ్రామంలో ఎవరైనా నాటు సారా తయారు చేస్తే ఊరు నుంచి తరిమి కొడతామని ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిని,వారికి సహకరించిన వారిని పట్టుకొని కేసులు పెడతామని హెచ్చరించారు. ముందుగా గ్రామంలో మహిళలచే నవోదయం 2.0 కార్యక్రమం అమలయ్యే విధంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కొత్తవలస ప్రొబేషన్ ఎక్సైజ్ శాఖ,ఎస్సై వి.ఎన్ రాజు, సిబ్బంది బి.రాముడు పి. వీర్రాజు, బి.ఆదినారాయణ,బి. హరికిరణ్, వీఆర్వో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్,డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదైన వయోజనులకు 3 గంటల పరీక్ష

ఈనెల 23న ఉదయం 10 గంటల నుండి 5 గంటల మధ్య రాయవచ్చు

జిల్లాలో 875 పరీక్షా కేంద్రాల ఏర్పాటు : కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం క్రింద నమోదైన నిరక్షరాస్యులైన వయోజనులకు 3 గంటల పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు జరుగుతుందని, ఈ మధ్యలో ఏ 3 గంటలైనా అభ్యర్థులు పరీక్షను రాయవచ్చునని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సుమారు 48 వేల మంది ఈ పరీక్ష రాయనున్నారని, అందుకోసం 875 పాఠశాలలను గుర్తించి పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్లో ఉల్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లు గా జవాబు పత్రాన్ని మూల్యాంకనం చేయుటకు, అర్హత కలిగిన అంగన్వాడీ టీచర్లను నియమించాలని తెలిపారు. ఈ పరీక్షల పరిశీలకులుగా వెలుగు ఏ.పి.ఎం లను నియమించాలని, వీరు పరీక్ష అనంతరం జవాబు పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, హాజరు పత్రాలు, మార్క్స్ అవార్డు షీట్ లు నిర్దేశిత ప్రోఫార్మ లో ఎక్సెల్ షీట్ లో అప్లోడ్ చేయాలనీ సూచించారు.ఈ సమావేశం లో వయోజన విద్య డి.డి. సోమేశ్వర రావు, ఐ.సి.డి.ఎస్ ఇంచార్జ్ పి.డి ప్రసన్న, డి.ఆర్.డి.ఏ ఏ.పి.డి సావిత్రి, వయోజన విద్య శాఖ ఏ.పి.ఓ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలిపల్లి అమ్మవారి పండుగ మహోత్సవం

విశాలాంధ్ర -మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ పరిధి,గవర్ల అనకాపల్లి గ్రామంలో కొలువైన శ్రీ పోలిపల్లి అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం గ్రామంలోని మహిళలంతా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు అమ్మవారికి విశేష పూజలు చేశారు.ఈ సందర్భంగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో బుద్ధ రవి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గ దార్శనిక పత్రాల రూపకల్పనపై కసరత్తు

పాల్గొననున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ఇతర ప్రజాప్రతినిధులు

సలహాలు, సూచనల స్వీకరణకు 15న సమావేశం : జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర, జిల్లాల సత్వర అభివృద్ధి కోసం స్వర్ణాంధ్ర-2047 పేరుతో దార్శనిక పత్రాన్ని రూపొందించిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అసెంబ్లీ నియోజకవర్గం వారీగా అభివృద్ధి సాధనకు దార్శనిక పత్రాలను రూపొందించాలని సంకల్పించింది. దీనిలో భాగంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో అందుబాటులో వున్న వనరులను వినియోగించుకొని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో నియోజకవర్గ అభివృద్ధికి దార్శనిక పత్రాలను రూపొందించేందుకు కసరత్తును ప్రారంభించింది. నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికల రూపొందించడంలో భాగంగా జిల్లాలోని మంత్రులు, ఎంపిలు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, జెడ్పీ ఛైర్మన్, కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు స్వీకరించేందుకు మార్చి 15వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఒక సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. వీరితోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన అన్ని వర్గాల నుంచి సూచనలు స్వీకరించిన మీదట వీటన్నింటినీ క్రోడీకరించి ఒక సమగ్ర దార్శనిక పత్రాన్ని రూపొందించడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేరకు ప్రతి ఏటా 15శాతంకు మించిన వృద్ధిరేటు సాధించే రీతిలో యీ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవా రంగాలపై ప్రధానంగా దృష్టి సారించి మౌలిక వసతులు మెరుగుపరచడం, ఆర్థికవృద్ధిని తద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించడం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. వృద్ధిరేటను సాధించడంలో వున్న అవరోధాలు వంటి అంశాలను యీ సమావేశంలో చర్చించి వాటిని అధిగమించేందుకు పరిష్కారాలను కనుగొనే దిశగా సమావేశంలో చర్చిస్తారని తెలిపారు.

ఉత్సాహభరితంగా జిల్లా స్థాయి గుర్రం పందాలు పోటీలు

పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని తవ్వానిపాలెం గ్రామ దేవత శ్రీ పరదేశిమాంబ అమ్మవారి పండగ అనుపు మహోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాస్థాయి గుర్రం పందేలు పోటీలు ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ గుర్రం పందేలు పోటీలు ను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అంతకుముందు శ్రీ పరదేశిమమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరదేశిమాంబ అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని, గ్రామం సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. పరదేశిమంబ పండగ మహోత్సవం జిల్లాలోని అత్యంత వైభవంగా జరుగుతుందని,అలాగే పలు సంస్కృత కార్యక్రమాలతో నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఈ పోటీలలో గెలుపొందిన విజేతలు ప్రథమ బహుమతి భార్గవ్ జెర్సీ , ద్వితీయ బహుమతి సింగపూర్ సత్యనారాయణ సత్యమ్మ తల్లి శక్తి, తృతీయ బహుమతి సురేంద్ర వారాహి, నాలుగో బహుమతి అప్పలనాయుడు చిరుత, 5వ బహుమతి సింగపూర్ సత్యనారాయణ దేవరాయ, ఆరో బహుమతి సురేంద్ర రాకెట్ లకు లభించాయి. విజేతలకు వరుసగా 12వేలు, 10 వేలు, 8 వేలు,6 వేలు, 4 వేలు,2 వేలు నగదు బహుమతులను ఎంపీటీసీ బోకం బాలకృష్ణ బాలు వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు బోకం శ్రావణ్ కుమార్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ఎంపీపీ భోకం సూర్యకుమారి రామునాయుడు, పెందుర్తి వైఎస్ఆర్సిపి నాయకులు గండి రవికుమార్, ఎంపీటీసీ బోకం బాలకృష్ణ (బాలు), వైసిపి మండల యువజన విభాగంఅధ్యక్షులు బోకం శ్రావణ్ కుమార్, బోకం కాసుబాబు, బోకం శేషగిరిరావు, వైసీపీ నేతలు మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, కోటాన రాము, పాలిశెట్టి సురేష్ రాజ్, కర్రీ బాబు, మోపాడ అప్పారావు, వద్దాది అప్పలరాజు,ఎర్ల నాయుడు,గొర్లి రాజేష్, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, గవర రాజు, బాలు యూత్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో లివర్ మార్పిడి శస్త్రచికిత్స

క్లిష్టతరమైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన విమ్స్ వైద్యులు
అవయవదానంపై విస్తృత అవగాహన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

విశాలాంధ్ర-విశాఖపట్నం : వైద్యరంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వస్తున్న క్రమంలో గతంలో ఎన్నూడూ జరగని విధంగా విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(విమ్స్) వైద్యుల బృందం క్లిష్టతరమైన శస్త్రచికిత్సలను సాహసోపేతంగా నిర్వహించి అరుదైన రికార్డును సృష్టించారు.కేవలం కార్పోరేట్ ఆసుపత్రుల్లోనే జరిగే అత్యంత ఖరీదైన అవయువమార్పిడి సర్జరీలను ఆంధ్ర రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలోని వసతులను వినియోగించుకుంటూ లివర్ మార్పిడి శస్త్రచికిత్స చేపట్టి సరికొత్త చరిత్రను సృష్టించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి కాలే యాన్ని స్వీకరించి 40 ఏళ్ల వయసు గల వ్యక్తికి విమ్స్ వైద్యులు విజయవంతంగా కాలేయాన్ని అమర్చారు..రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రి విశాఖ విమ్స్‌లో లివర్ మార్పిడి చేసి నూతన రికార్డును సైతం నెలకొల్పారు. ఈనెల 2వ తేదీన శ్రీకాకుళానికి చెందిన ఓ వ్యక్తి బ్రెయిన్ డెడ్ కావటంతో ఆ వ్యక్తి కుటుంబ సభ్యులకు అవయవ దానంపై వివరించగా, వారు సైతం అవయువదానం చేసేందుకు ముందుకు వచ్చారు..దీనితో బ్రెయిన్‌డెడ్ అయిన ఆ వ్యక్తి నుంచి సేకరించిన కాలేయాన్ని.. ఈనెల 3వ తేదీన విమ్స్ ఆస్పత్రికి తరలించారు.. అప్పటికే లివర్ కోసం జీవన్‌ధార్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 40 ఏళ్ల వ్యక్తికి

ప్రాధాన్యత క్రమాన్ని పాటిస్తూ, పూర్తిగా కాలేయం పాడైపోయి తీవ్ర అనారోగ్యానికి గురైన వ్యక్తికి ఆయా లివర్‌ను అమర్చి పునర్జీవం పోశారు. విమ్స్ ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, అనస్తీసియా, జెనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన వైద్య బృందాలు సమన్వయంతో కాలేయాన్ని సకాలంలో 40 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా అమర్చి ఆయా శస్త్రచికిత్సను విజయవంతం చేశారు.

ప్రత్యేక పరిస్థితుల మధ్య సర్జరీ చేసాం... డాక్టర్ కే రాంబాబు, జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ : వైద్యరంగంలో కాలేయం మార్పిడి సర్జరీ అనేది చాలా సంక్లిష్టమైనది. ఈ సర్జరీ కోసం కొన్ని ప్రత్యేక పరిస్థితులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.. అవయవ గ్రహీతకు ఎటువంటి ఇన్ఫెక్షన్లు రాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించి, వారిని జాగ్రత్తగా చూసుకోవాలి. అన్ని రకాలుగా ప్రత్యేక శ్రద్ధను తీసుకొని నిరంతరం పర్యవేక్షిస్తూ విజయవంతంగా కాలేయ మార్పిడి ప్రక్రియను పూర్తిచేశాం.. అవయవ గ్రహీత వారం రోజులు పాటు వైద్య బృందం పర్యవేక్షణలో ఉండటంతో పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారు.. ఇంత సంక్లిష్టమైన సర్జరీను విజయవంతంగా పూర్తి చేసిన విమ్స్ వైద్యుల బృందానికి నా ప్రత్యేక అభినందనలు.. ఏపీలో తొలిసారి ప్రభుత్వ ఆసుపత్రిలో కాలేయ మార్పిడి సర్జరీ చేసేందుకు ప్రోత్సహించిన ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ నరసింహం కి కృతజ్ఞతులు తెలిపారు. అవయువదానంపై గ్రామ స్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజల్లో చైతన్యం వస్తే ఎంతో మంది అవయువల కోసం ఎదురుచూసే వారికి ఎంతో మేలు చేకూరుతుంది. ప్రతి ఆసుపత్రిలో జీవన్‌ధాన్‌పై సదస్సులు నిర్వహిస్తున్నాం.

కారులో భారీగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్ : మండలంలో బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా అరకు నుండి ఎస్ కోట వైపు వస్తున్న టాటా ఇండికా కారులో సుమారు 50 కేజీల వరకు గంజాయి పట్టుబడింది. ఈ కేసు విషయమై నిందితుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సీఐ వి. నారాయణమూర్తిని వివరణ కోరగా పూర్తి దర్యాప్తు చేసి బుధవారం నిందితుల వివరాలు తెలియజేస్తామని తెలిపారు.